జాతీయ, రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల/తెగల కమిషన్లు

షెడ్యూల్డ్ కులాలు/తెగల వారికి రాజ్యాంగ పరంగా కొన్ని రక్షణలు కల్పించారు. అవి సక్రమంగా అమలు అవుతున్నాయో, లేదో పరిశీలించడానికి, రాష్ట్రపతి 338వ రాజ్యాంగ ప్రకరణ కింద ఒక ప్రత్యేక అధికారిని నియమించవచ్చు. మొదటిసారిగా, 1950 నవంబర్‌లో 'షెడ్యూల్డ్ కులాల కమిషనర్' నియమితులయ్యారు. 1978లో కేబినేట్ నిర్ణయం మేరకు 'బహుసభ్య' షెడ్యూల్డ్ కులాల/తెగల కమిషన్ ఏర్పాటు చేశారు. 65వ రాజ్యాంగ సవరణ చట్టం (1990) మేరకు దీనికి రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించారు. 89వ రాజ్యాంగ సవరణ చట్టం (2003) ద్వారా ఈ కమిషన్‌ను : i) షెడ్యూల్డ్ కులాల కమిషన్ ii) షెడ్యూల్డ్ తెగల కమిషన్ అనే రెండు కమిషన్లుగా పునర్‌వ్యవస్థీకరణ చేశారు. 338వ ప్రకరణలోని 5, 8, 9 క్లాజులలో వీటి విధులు, అధికారాలు పేర్కొన్నారు.

జాతీయ కమిషన్ల వ్యవస్థీకరణ విధులు:

అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, మరో ముగ్గురు సభ్యులతో కూడిన ఈ కమిషన్‌ను రాష్ట్రపతి ఏర్పాటు చేస్తారు. దీని పని షరతులు పార్లమెంటు చట్టం ద్వారా నిర్ణయిస్తారు.

ముఖ్య విధులు

ఎ) రాజ్యాంగ పరంగా చట్టాల ద్వారా షెడ్యూల్డ్ కులాల/తెగల వారికి కల్పించిన రక్షణలు సక్రమంగా కల్పించటాన్ని పర్యవేక్షించడం, విచారించడం

బి) వీరి హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులను విచారించడం

సి) వీరి ఆర్థిక సామాజికాభివృద్ధి కోసం రూపొందించే ప్రణాళికల రూపకల్పనలో సలహాలివ్వడం

డి) రాష్ట్రపతికి వార్షిక నివేదిక సమర్పించడం

ఇ) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వీరిని ఉద్దేశించి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల అమల్లో తగిన సూచనలివ్వడం

ఎఫ్) రాష్ట్రపతి నిర్దేశం మేరకు ఈ కులాలు/తెగల ప్రయోజనార్థమై మరేతర విధులు నిర్వహించడం

పైన ప్రస్తావించిన ఎ, బి క్లాజులకు సంబంధించి కమిషన్ సివిల్ కోర్టు అధికారాలను కలిగి ఉంటుంది. ఆ మేరకు...

i) సంబంధిత వ్యక్తులకు కమిషన్ ముందు హాజరు కావాలని సమన్లు జారీ

ii) సంబంధిత పత్రాలు సమర్పించమని ఉత్తర్వుల జారీ

iii) అఫిడవిట్లను స్వీకరించడం

iv) న్యాయస్థానం లేదా ప్రభుత్వ కార్యాలయం నుంచి అవసరమైన సమాచారం పొందడం

v) సాక్షులను, అధికార పత్రాలను విచారించడానికీ, పరిశీలించడానికీ సమన్లు జారీ చేయడం

vi) రాష్ట్రపతి నిర్ణయం మేరకు మరేతర విధులను నిర్వహించడం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు షెడ్యూల్డ్ కులాలు/తెగలకు సంబంధించి ముఖ్య విధానపర నిర్ణయాలను తీసుకొనేటప్పుడు జాతీయ కమిషన్లను సంప్రదిస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల/తెగల కమిషన్ పని చేస్తుంది.

మహిళా కమిషన్

రాజ్యాంగ పరంగా, చట్టపరంగా మహిళలకు కల్పించిన ప్రయోజనాల పరిరక్షణను పర్యవేక్షించడం కోసం 1990 జాతీయ మహిళా కమిషన్ చట్టం ఆమోదించారు. ఆ మేరకు 1992లో జాతీయ మహిళా కమిషన్ ఏర్పాటు అయింది. రాష్ట్రపతి ఏర్పాటు చేసే ఈ బహుసభ్య వ్యవస్థలో అధ్యక్షులు, ఐదుగురు ఇతర సభ్యులు మూడేళ్ల పదవీ కాలానికి నియమితులవుతారు. ఐదుగురు సభ్యుల్లో ఒకరు షెడ్యూల్డ్ కులాలకు, ఇంకొకరు షెడ్యూల్డ్ తెగలకు ప్రాతినిధ్యం వహిస్తారు. కమిషన్ ప్రస్తుత అధ్యక్షులు డా।। గిరిజావ్యాస్.

దీని ముఖ్య విధులు

1. మహిళలకు కల్పించిన రాజ్యాంగ, చట్టపరమైన రక్షణలను సమీక్షించటం
2. చట్టపరమైన పరిహార మార్గాలను సూచించటం
3. మహిళల క్లేశ నివారణకు కృషి చేయటం
4. మహిళలను ప్రభావితం చేసే అన్ని ముఖ్య విధానపరమైన విషయాల్లో ప్రభుత్వానికి సలహాలివ్వడం

ఈ విధులను నిర్వహించడానికి మహిళా కమిషన్‌కు మానవ హక్కుల కమిషన్, షెడ్యూల్డ్ కులాల/తెగల కమిషన్లకు ఇచ్చిన అధికారాలున్నాయి. సమాచారాన్ని సేకరించడానికీ, సమన్లు జారీచేయడానికి దీనికి సివిల్ కోర్టు అధికారాలున్నాయి. ఫిర్యాదులను స్వీకరించి విచారించడానికీ, మహిళా జైళ్లు, రిమాండ్ హోంలను తనిఖీ చేయడానికి అధికారముంది.

అల్పసంఖ్యాక వర్గాల కమిషన్

భారత రాజ్యాంగం భాషాపరమైన, మతపర మైన అల్ప సంఖ్యాక వర్గాలను గుర్తిస్తుంది. విభిన్న భాషలకు ఆలవాలమైన భారతదేశంలో వివిధ ప్రాంతాల్లో సంఖ్యా పరంగా, భాషా పరమైన అల్ప సంఖ్యాక వర్గాలున్నాయి. వారి సంతతికి ప్రాథమిక విద్య స్థాయిలో మాతృభా

షలో విద్యను పొందే హక్కును కల్పిస్తూ 7వ రాజ్యాంగ సవరణ చట్టం (1956) 350 (ఎ) ప్రకరణను చేర్చింది. అదే చట్టప్రకారం 350 (బి) ప్రకరణ కింద రాష్ట్రపతి భాషాపరమైన అల్ప సంఖ్యాక వర్గాల ప్రయోజనాలు పరిరక్షించడం కోసం ప్రత్యేక అధికారిని నియమిస్తారు. 1957లో భాషాపరమైన అల్పసంఖ్యాక వర్గాల కమిషనర్ మొదటి సారిగా నియమితులయ్యారు.

భాషతో పాటు భారతదేశంలో మత పరమైన వైవిధ్యం కూడా ఉంది. మతపరమైన అల్పసంఖ్యాక వర్గాల ప్రయోజనాలను పరిరక్షించడానికి, 1992లో ఒక చట్టం అమలులోకి వచ్చింది. ఆ చట్ట నిబంధనల మేరకు జాతీయ అల్పసంఖ్యాక వర్గాల కమిషన్ 1993లో ఏర్పాటైంది. ఇది బహుసభ్య సంఘం. అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, మరో ముగ్గురు సభ్యులు మూడేళ్ల పదవీ కాలానికి రాష్ట్రపతి ద్వారా నియమితులవుతారు. ప్రస్తుత అధ్యక్షులు మహ్మద్ షఫీ ఖురేషి. ఆంధ్రప్రదేశ్ అల్పసంఖ్యాక వర్గాల కమిషన్ అధ్యక్షులు యూసఫ్ ఖురేషి.

ఈ కమిషన్ విధులు

1. కేంద్ర, రాష్ట్ర స్థాయిలో అల్పసంఖ్యాక వర్గాల ప్రగతికి తీసుకున్న చర్యలను సమీక్షించటం
2. రాజ్యాంగ పరమైన, చట్ట పరమైన సంరక్షణల అమలు సమీక్షించటం
3. సంరక్షణలు ప్రభావవంతంగా అమలు చేయడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగు సూచనలివ్వటం
4. అల్పసంఖ్యాక వర్గాల హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత వ్యవస్థ దృష్టికి వాటిని తీసుకురావటం
5. విద్యారంగంలో వీరి పురోభివృద్ధికి సంబంధించిన అంశాల మీద అధ్యయనం చేయటం
6. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అల్పసంఖ్యాక వర్గానికి సంబంధించి తగిన సలహాలనివ్వటం
7. అల్పసంఖ్యాక వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యల మీద కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు సమర్పించటం
8. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మరేతర విధులను నిర్వహించటం

అధికారాలు

పై విధులను నిర్వహించడానికి, కమిషన్‌కు సివిల్ కోర్టు అధికారాలున్నాయి. ఆ మేరకు సమన్లు జారీ చేయడానికి, అఫిడవిట్లు స్వీకరించడానికి, అధికార పత్రాలను సమర్పించమని కోరడానికి అధికారముంది. ఈ విషయంలో జాతీయ మానవహక్కుల, మహిళా, షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల కమిషన్‌ను పోలి ఉంటుంది.

ప్రాక్టీస్ ప్రశ్నలు...

1. 1978లో బహుసభ్య షెడ్యూల్డ్ కులాలు, తెగల కమిషన్ ఏర్పరచినప్పుడు దాని మొదటి అధ్యక్షులు?

ఎ) భోలాపాశ్వాన్ శాస్త్రి బి) డా. అంబేద్కర్
సి) బాబు జగ్జీవన్ రామ్ డి) రామ్‌ధన్

2. ప్రస్తుత జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ అధ్యక్షులు?

ఎ) సరోజిని మహిషి బి) జినాభాయి ధర్జీ
సి) ఊర్మిళా సింగ్ డి) బండి ఓరన్

3. మత పరమైన భాషాపరమైన అల్పసంఖ్యాక వర్గాల జాతీయ కమిషన్ ఎప్పుడు ఏర్పాటు చేశారు?

ఎ) 1992 బి) 1993 సి) 2003 డి) 2005

4. జాతీయ అల్ప సంఖ్యాక వర్గాల కమిషన్ల చట్టం, 1992లో కింది మత పరమైన అల్ప సంఖ్యాక వర్గాన్ని గుర్తించలేదు?

ఎ) సిక్కులు బి) జైనులు
సి) పార్శీలు డి) బౌద్ధులు

5. అల్ప సంఖ్యాక వర్గాల జాతీయ కమిషన్‌కు రాజ్యాంగ పరమైన హోదాను కల్పించడానికి ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లు?

ఎ) 101 బి) 102 సి) 103 డి) 104

జవాబులు	1	2	3	4	5
	A	A	D	B	C